క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు

మండల వ్యాసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి

పరిగి: కొత్తగా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు కొత్త పాసుపుస్తకాలు వచ్చిన రైతులు అర్హులన్నారు. ఇంతకు ముందు చేసుకోని వారు కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పట్టాపాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామిని, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాలని చెప్పారు.

ఇద్దరు ఆర్‌ఐలు, సర్వేయర్ బదిలీ

అటెండర్ లక్ష్మమ్మ కూడా..

తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఆర్‌ఐలు రాజిరెడ్డి, ఖాజాలు బదిలీ అయ్యారు. కార్యాలయంలో పని చేస్తున్న సర్వేయర్ శ్రీహరినాయక్, అటెండర్ లక్ష్మమ్మ కూడా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆర్‌ఐ రాజిరెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తుండగా.. మరో ఆర్‌ఐ ఖాజా కుల్కచర్లలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. వీరిద్దరుతో పాటు సర్వేయర్, అటెండర్ కూడా నాలుగు సంవత్సరాలు పని చేయడంతో బదిలీ తప్పనిసరి అయింది. ఇద్దరు ఆర్‌ఐలు రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, సర్వేయర్ దుద్యాల మండలాలకు, అటెండర్ యాలాల మండలానికి బదిలీపై వెళ్లారు. అయితే అటెండర్ లక్ష్మమ్మకు ఉత్తర్వులు రాగా.. ఆర్‌ఐ, సర్వేయర్‌కు ఉత్తర్వులు రావాల్సి ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో మేలు



సర్టిఫికెట్లను అందజేస్తున్న భీమరాజు

కొడంగల్ రూరల్: కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని వీబీఆర్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు భీమరాజు అన్నారు. శనివారం కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లి ఉత్సవాలు



బోనాల ఊరేగింపు

బొంరాస్‌పేట: మండలంలోని రేగడిమైలారంలో పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన, బోనాల పండుగ ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. 139 బోనాలతో ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఊరేగింపులో పోతరాజు, పులివేషాలు అలరించాయి.

ఒకపూట మాత్రమే డ్యూటీ ఉండాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అనంతగిరి: రెండు పూటల డ్యూటీ వద్దని, ఒకపూట మాత్రమే ఉండాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ కార్మికులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు 8గంటల పని విధానం కల్పించాలన్నారు. పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కనీస వేతనాలను పెంచాలన్నారు. పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. 5వ తేదీలోపు జీతాలు రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాములు, లక్ష్మమ్మ, అనంతమ్మ, శంకర్, బందమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

తాండూరు టౌన్ : గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోకట్ రోడ్డు మార్గంలోని సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో సాయిబాబా రథయాత్ర నిర్వహించారు. పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న ప్రత్యేక పూజలు చేసి, స్థానిక భవాని మాత దేవాలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, సాయిపుత్ర హోమ్స్ ప్రతినిధి శంకర్ యాదవ్ దంపతులు, కీర్తిశర్మ, సాయిలుగౌడ్ తదితరులు పూజలు నిర్వహించారు.

అమ్మో జ్వరం.. జరభద్రం

- అపరిశుభ్రతే సీజనల్ వ్యాధులకు మూలం
- వర్షాకాలంలో చిన్నారులకు వ్యాపిస్తున్న జ్వరాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు.. మండలంలో వైద్య సేవలు కరువు



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

దుద్యాల్: వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణంలోని మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాలు, ఇతర రోగాలు విజృంభిస్తున్న తరుణంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాంతక పరిస్థితులు తలెత్తే ప్రమాదముంది. దుద్యాల మండలంలోని 23 గ్రామాల్లో సుమారు 50 వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలితే సబ్ సెంటర్ల ద్వారా సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అన్ని మందులు అందుబాటులో ఉంచారని వైద్యులు చెబుతున్నారు. గతవారం రోజులుగా ముసురు వానలు కురుస్తుండడంతో సీజనలు వ్యాధులు ప్రబలుతున్నాయి. చిన్నారులు జర్వాల బారిన పడుతున్నారు. రోగాలు వచ్చాక బాధపడటం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

దోమలతోనే అనారోగ్యం

ప్రజల ఆరోగ్యం క్షీణించడానికి దోమలే ప్రధాన కారణం. వీటి వల్ల డెంగీ, మలేరియా, బోధ, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలుతాయి. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా, ఇంటి చుట్టూ నీటి నిల్వలు ఉంటే, దోమలు పెరిగి వ్యాధులు విజృంభించే అవకాశాలున్నాయి.

డెంగీ జ్వరం

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, నొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం తగ్గినట్లు తగ్గి వారం పది రోజులు ఉంటుంది. ఏడీఎస్ దోమ వల్ల వచ్చే ఈ జ్వరం ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కళ్ల నొప్పి, శరీరంపై దద్దుర్లు రావడం ఈ జ్వరం వంటి లక్షణాలు ఉంటాయి.

మలేరియా జ్వరం

తీవ్రమైన జ్వరం, చలితో వణుకు ప్రారంభమై నెలల తరబడి బాధిస్తుంది. ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల వ్యాపించే ఈ వ్యాధి వర్షాకాలంలో అధికంగా వస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాకాలంలో వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలి.
- ఎప్పటికప్పుడు నీటి పాత్రలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలి.
- భోజనానికి ముందు చేతులు శుభ్రంగా చేసుకోవాలి.
- ఇంటి చుట్టూ పక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో లార్వాను నాశనం చేయాలి.

పీహెచ్‌సీ లేకపోవడంతో..

మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దుద్యాల్, హకీంపేట, చిలుముల మైల్వార్, హస్నాబాద్, గౌరారంలో మాత్రమే పల్లె దవాఖానాలు ఉన్నాయి. మండలంలోఅధికంగా గిరిజన తండాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో మాత్రమే వెల్‌నెస్ సెంటర్లు, సబ్ సెంటర్లు ఉన్నాయి. తండాల్లో మాత్రం అవేమి లేకపోవడంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా కొడంగల్, కోస్గి, తాండూర్, మహబుబ్‌నగర్ పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మండలంలో వైద్య సేవలు ప్రారంభించాలని ఇక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఎవరైనా అనారోగ్యానికి గురైతే.. పల్లె దవాఖానాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం. ఎక్కువ అనారోగ్య సమస్యలు తలెత్తితే బొంరాస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. – డాక్టర్, హేమంత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, బొంరాస్‌పేట

తొమ్మిది మంది కార్యదర్శులు బదిలీ

- ఆరుగురు ఇతర మండలాలకు.. ముగ్గురు సొంత మండలానికి..



పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయం

పెద్దేముల్: మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో, 36 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఇందులో తొమ్మిది మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీలయ్యారు. అందులో ఆరు మంది బంట్వారం, కోటపల్లి, ధారూర్, మర్పల్లి మండలాలకు వెళ్లగా, ముగ్గురు పెద్దేముల్ మండలంలోనే ఉన్నారు. దుగ్గాపూర్ పంచాయతీ కార్యదర్శి హేమలత లింగంపల్లి, ఎర్రగోడుతండా కార్యదర్శి సంధ్యారాణి నాగసారం (కోటపల్లి)మండలం. అడ్కిచెర్ల – మహేశ్ సిరిపురం (మర్పల్లి) మండలం. ఖానాపూర్ యశ్వంత్ బోపునారం(బంట్వారం) మండలం. గోట్లపల్లి – రాజు చెన్నారం (యాలాల) మండలం. బండపల్లి- రమేశ్ పెద్దేముల్ మండల కొండాపూర్, కొండాపూర్-నరేష్ పెద్దేముల్ మండల రుక్మాపూర్, రుక్మాపూర్- పరమేశ్ పెద్దేముల్ మండల గోట్లపల్లి గ్రామాలకు స్థాన చలనం అయినట్లు సంబంధిత శాఖ అధికారుల ద్వారా తెలుస్తుంది. బదిలీపై వెళ్లిన వారి స్థానంలో కొత్త పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరే అవకాశాలున్నాయి. కాగా, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొంత మంది ఇక్కడి నుంచి వెళ్తున్నట్లు సమాచారం.

టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిగి: మున్సిపల్ శాఖ పరిధిలోని దుకాణాల టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో ఉన్న 27 దుకాణా సముదాయాల గడువు పూర్తయి దాదాపుగా 3నెలలు గడుస్తుందన్నారు. అయినా, అధికారులు టెండర్ ప్రక్రియను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాసి టెండర్ల ప్రక్రియను నిర్వీర్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. టెండర్లు రిజర్వేషన్ల ప్రకారం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టెండర్ల ప్రక్రియను కొనసాగించకపోతే పెద్ద ఎత్తు నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



ప్రిన్సిపల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బంట్వారం: తెలంగాణ మోడల్ స్కూల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెండింగ్ వేతనాలు చెల్లించాలని శనివారం బంట్వారం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సరళారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత 4 నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందన్నారు. విధులకు రావాలన్నా ట్రాన్స్‌పోర్ట్ చార్జీలకు కూడా కష్టమవుతుందని వాపోయారు. వ్యాయామ ఉపాధ్యాయుడితో పాటు కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ సబ్‌ఆర్డినేట్, నైట్ వాచ్‌మెన్లకు జీతాలు అందడం లేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ వేతనాలు అందేలా చూడాలని వారు ప్రిన్సిపాల్‌కు విజ్ఞప్తి చేశారు. వేతనాలు వచ్చే వరకు తాము విజిల్‌డౌన్, పెన్‌డౌన్, బెల్‌డౌన్ అన్ని పనులు డౌన్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు స్వరూప, వెంకటేశం, బిచ్చప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



దోమ: మొక్కలను అందజేస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

పూడూరు: మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సైబేజ్ కంపెనీ సీఎస్ఆర్ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దత్తత గ్రామం దేవనోనిగూడలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో 'సైబేజ్ ఆశా' కార్యక్రమం ద్వారా నీలగిరి, జామ, సీతాఫల్ 300 రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. మొక్కలు నాటితేనే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. గతంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పాఠశాల గదులకు పెయింటింగ్, టాయిలెట్‌లు, అదనపు భవనాలను నిర్మించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుచ్చన్న, నారాయణ, సీతారాంరెడ్డి, కంపెనీ ప్రతినిధులు కిరణ్‌కుమార్, గోపి, సత్య, రాజు, గుల్షన్, తిరుపతి, రాజశేఖర్, సంగమేష్ పాల్గొన్నారు.

సంరక్షణ బాధ్యత చేపట్టాలి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరించాలని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం పరిధిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కలు నాటడం వల్ల ప్రకృతిని కాపాడినవారము వుతామన్నారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరు తెలుసుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: ప్రజలందరూ తప్పనిసరిగా మొక్కలను నాటాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు కోరారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డితో కలసి ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు దోహదపడాలని సూచించారు. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో దోహదపడుతాయని, ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటుకొని వాటిని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, మాజీ వైస్ ఎంపీపీ బంగ్ల యాదయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, టీఏ ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వానొచ్చి ఆగం చేసింది!

- ఆందోళనకు గురైన కూరగాయరైతులు



కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ధారూరు: రోజంతా ముసురు వాన పడటంతో గత వారం కిలో రూ.100 నుంచి రూ. 120 వరకు పలికిన కూరగాయల ధరలు శనివారం అమాంతం పడిపోయాయి. సంతలో కూరగాయలు అమ్ముడుపోకపోవడంతో రైతులు ధరలు తగ్గించి విక్రయించారు. దీంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. రైతులు దిగాలు చెందారు. తాండూరు, వికారాబాద్ మార్కెట్లలో అధిక ధరలకు ఆకుకూరలు, కూరగాయలు కొనుగోలు చేసి తీసుకువచ్చిన వ్యాపారులు బాగా నష్టపోయారు.

అసంపూర్తి పనులు చేపట్టాలని తీర్మానం



మాట్లాడుతున్న ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. మండల విద్యాధికారి, హెచ్‌ఎం రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యాపరమైన అంశాలతో పాటు పాఠశాల ఆవరణలో టాయిలెట్ల మరమ్మతు చేయించాలని, ప్రహరీ చుట్టూ ఉన్న కంపచెట్ల తొలగింపు, పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉండకుండా మున్సిపాలిటీ సిబ్బంది చర్యలు తీసుకునేలా అధికారులకు తెలియజేయాలని తీర్మానం చేశారు. ఎంఈఓ రాంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పిల్లల అవసరాలపై చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్‌హఖ్, ఉపాధ్యాయులు మెరాజ్‌బేగం, షహనాబాను, వేణుగోపాల్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు

తట్టెపల్లిలో రూ.89.26లక్షలు జమ



సీఈఓ రాజమౌళి

పెద్దేముల్: రుణమాఫీ నిధులకు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందని తట్టెపల్లి సీఈఓ రాజమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దేముల్ మండల తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 886 సభ్యులకు రూ.7.89 కోట్ల రుపాయలు రైతులకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. రూ.లక్షలోపు 523 సభ్యులకు రూ.2.49 కోట్లు రుణాలు, రూ.లక్ష నుంచి రూ.లక్ష 50వేల వరకు 181 మంది, రూ.1.50 నుంచి రూ.2లక్షల వరకు 182 మందికి మొత్తం రూ.5.38 కోట్ల రుపాయల నిధులు రైతులకు పంట రుణాల ఇచ్చామని తెలిపారు. అందుల్లో రూ. లక్ష లోపు 206 మంది సభ్యులకు ప్రభుత్వం రూ.89.26లక్షలు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని సీఈఓ రాజమౌళి చెప్పారు.

ఇళ్లు తొలగించకుండా చూడండి



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు తొలగించకుండా చూడాలని అందిన ఫిర్యాదు మేరకు జాతీయ రోడ్డు నిర్మాణాల ఈఈ రమేశ్, డీఈఈ రమేశ్‌బాబు, ఏఈ సురేందర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ రహదారిగా విస్తరిస్తున్న మహబుబ్‌నగర్ –చించోల్లి రోడ్డు విస్తరణలో భాగంగా హస్నాబాద్ గ్రామంలో దత్తు సంజీవ, రాకేశ్‌గౌడ్, రాములు, సురేశ్‌గౌడ్, బసప్ప, శేఖర్, చంద్రప్ప, దౌల్తాబాద్ మల్లేశ్, సైయ్యద్, రుక్మొద్దిన్, శేఖర్‌లకు సంబంధించిన ఇళ్లు కొంతభాగం తొలగించాలని రోడ్డు విస్తరణ అధికారులు తెలియజేశారు. ఇళ్లు తొలగించకుండా చూడాలని బాధితులు ఇటీవలే కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదులు చేశారు. అందులో భాగంగానే పరిశీలించినట్లు వారు తెలిపారు. పరిశీలించిన అంశాలను పైఅధికారులకు నివేదిక అందిస్తామన్నారు. వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మల్లేశ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భీములు, బాధితులు, అధికారుల వెంట ఉన్నారు.

పిల్లల ఉన్నతికి తల్లిదండ్రులే కీలకం



కుల్కచర్ల: మాట్లాడుతున్న పాండురంగయ్య

కుల్కచర్ల: విద్యార్థుల సర్వతోముఖాబివృద్ధికి ఉపాధ్యాయులతో పాటుగా తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగయ్య అన్నారు. శనివారం మండలం ఇప్పాయిపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండి.. చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సుధారాములు, కిరణ్‌కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులదే

దోమ: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందని బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాఘవపురం రాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు వీడ్కోలు, స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలల నుంచి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతూ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యాసిస్తుంటారని, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి విద్యార్థుల భవిష్యత్తును మార్చాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ మాజీ చైర్మన్లు జంగయ్య, శ్రీనివాస్, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు రేణుక, రుక్మిణి, శివశంకర్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమర్థ్యాలను పరిశీలించాలి

పరిగి: విద్యార్థుల సమర్థ్యాలను వారి తల్లిదండ్రులు తెలుసుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. శనివారం మండల పరిధిలోని సయ్యాద్ మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

క్రమం తప్పకుండా హాజరు కావాలి

దుద్యాల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలలో 'విద్యార్థి–తల్లిదండ్రుల కార్యక్రమం' నిర్వహించారు. ముఖ్యంగా మండలంలోని దుద్యాల్, హకీంపేట, కుదురుమల్ల, హస్నాబాద్ గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం వాడివేడిగా జరిగాయి. పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం తక్కువగా వస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహించవద్దని, వారి ఉన్నత స్థాయికి ఎదగేలా చేసే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు.

రోజంతా ముసురు వాన

మోమిన్‌పేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శుక్ర, శనివారం ఎడతెరిపి లేకుండా రోజంతా ముసురు వారం కురుస్తూనే ఉంది.. దీంతో జనజీవనానికి ఆటంకం తప్పలేదు.. రోజువారి పనులకు వెళ్లే వారు.. ఉద్యోగాలకు వెళ్లే వారు నానా ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రోడ్లు జలమయమ్యాయి. పలు చోట్ల ఇళ్లు కూలాయి. లోతట్టు ప్రాంతాలు, పొలాల్లోకి నీరు చేరింది. చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకుంది.. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మోమిన్‌పేట:ఎన్కేపల్లిలో జలమయమైన రోడ్లు



దుద్యాల్‌లో కూలిన ఇల్లు



తాండూరు రూరల్: నిండిన ఊరచెరువు



దోమ: ఐనాపూర్‌లో చిత్తడిగా మారిన రోడ్లు



పెద్దేముల్ తండాలో కూలిన ఇల్లు